సాక్షి చిత్తూరు

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



బాబా సేవలో పెద్దిరెడ్డి..

పాలేరు జగనన్నకాలనీలో సాయిబాబా మందిర కుంభాభిషేకంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. - 8లో



ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ. మాజీ సీఎం జగన్ ఆది నుంచి ముస్లింలకు అండగా ఉంది. నేడు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసింది. - 8లో



కలెక్టరేట్‌లో పార్కింగ్ షెడ్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వాహనాలు ఆపి ఉంచుకునేందుకు షెడ్ నిర్మాణం చేపడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు రాజీనామాకు ఆమోదం

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ పాత పాలక మండలి సభ్యుల మూకుమ్మడి రాజీనామాలకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ శుక్రవారం జీఓ జారీ చేసింది. 2023 అక్టోబర్ 16వ తేదీ అప్పటి ప్రభుత్వం 15 మంది సభ్యులతో రెండేళ్ల కాలపరిమితికి ట్రస్టు బోర్డు నియామకం చేపట్టగా.. మొత్తం 15 మంది సభ్యులు స్వచ్ఛందంగా రాజీనామా చేశారని పేర్కొంటూ, వారి రాజీనామాలకు ఆమోదం తెలుపుతున్నట్టు దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ శుక్రవారం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. కాణిపాకం ఆలయానికి కొత్త పాలక మండలి నియామకానికి వీలుగా ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసినట్టు దేవదాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

సీనియర్ ఇంటర్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న డీవీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి ప్రభుత్వ బాలికల కళాశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు 7, కేజీబీవీలు 8, హైస్కూల్ ప్లస్‌లు 28 మొత్తం 74 కళాశాలల్లో చదువుతున్న దాదాపు 10 వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పకడ్బందీగా పంపిణీ కసరత్తు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 3వ తేదీతో ఇంటర్మీడియట్ మూల్యాంకనం పూర్తి అయినట్లు డీవీఈఓ తెలిపారు.

రైల్వే బోర్డు డివిజనల్ సభ్యుడిగా ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం: హుబ్లీ రైల్వే డివిజన్ వినియోగదారుల సలహా కమిటీ సభ్యుడిగా చిత్తూరు ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ నియమితులయ్యారు. రాష్ట్ర శాసనసభ జనరల్ సెక్రటరీ సిఫార్సు మేరకు ఈ నియామకం చేసినట్టు నైరుతి రైల్వే డివిజనల్ మేనేజర్ అరవింద హెర్లె శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

అత్యవసర వైద్యం.. ఆమడదూరం

- శ్రీరంగరాజుపురం గ్రామానికి చెందిన ఏకాంబరం ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పంక్చర్ అని షాపులో టైర్ మార్చుతుండగా జాకీ కాలుపై పడి గాయపడ్డాడు. స్నేహితులు అతడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అత్యవసర విభాగంలో ఎంఎన్‌ఓలు లేకపోవడంతో స్నేహితులే స్ట్రెచర్ పట్టుకెళ్లారు. అక్కడ డాక్టర్లు తాము బిజీగా ఉన్నాం.. మీరే ఆ రక్తపు మరకలు శుభ్రం చేయండనడంతో విస్తుపోయారు. పట్టించుకోకపోవడంతో తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇది రెండు రోజులకు క్రితం జరిగిన సంఘటన.
- ఇటీవల చిత్తూరుకు చెందిన రాయల్ విరేచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. జ్వరం కూడా ఉందని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. జ్వరం ఉందని గుర్తించకుండానే విరేచనాలతో తగ్గడానికి సెలైన్ బాటిల్ పెట్టడంతో అతడికి చలి ఎక్కువై సొమ్మసిల్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే కట్టమంచిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.
- ఆరు నెలల కిందట ప్రశాంత్‌నగర్ చెందిన ఓ వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం చిత్తూరు జిల్లాస్పత్రికి తీసుకొచ్చారు. అర్ధగంట వేచి చూసినా ఎవరు పట్టించుకోలేదని ఓ మహిళా కంటతడి పెట్టింది. ఇది ఒక ఆస్పత్రా..ఒకరైనా పట్టించుకుంటున్నారా...మనిషి చచ్చిపోయాక..శవాన్ని పారేస్తారా..ఎందుకు ఈ ఆస్పత్రి ఉండేదని మండి పడింది. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు పలువురు ఆర్తనాదాలు పెడుతున్నారు.

అత్యవసర వైద్యం.. అందులోనూ నిర్లక్ష్యం ప్రత్యేకం.. వసతులు, సిబ్బంది ఉండరు.. వైద్యులున్నా పట్టించుకోరు.. ఒక వేళ చూసినా పరిస్థితి విషమం.. వేరే ఆస్పత్రి తీసుకెళ్లండని సిఫార్సులు.. ఇలా ఆపద వేళ అత్యవసర చికిత్సకు సుస్తీ చేసింది. దాదాపు పడకేసింది. బాధితులు అరచేత ప్రాణాలు పట్టుకుని ఆస్పత్రికి వస్తే విధి నిర్వహణలోని సిబ్బంది చిత్తశుద్ధి లేక.. ప్రాణాలు నిలిపే వైద్యులు లేని దుస్థితి నెలకొంది. తమిళనాడు, తిరుపతికి వెళ్లడం మంచిదని ఇక్కడి వైద్యులు సెలవిస్తున్నారు. ఇదీ చిత్తూరు జిల్లాస్పత్రిలో అత్యవసర వైద్య విభాగం తీరు.



అత్యవసర విభాగంలో రోగులు

- స్ట్రెచర్ పట్టేవారూ కరువే
- అందని ద్రాక్షలా వైద్యం
- అన్నింటికీ రెఫర్
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్యం అందని ద్రాక్షలా మారుతోంది. ఆ విభాగంలో స్ట్రెచర్, వీల్‌చైర్లు కరవు అవుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం వెళ్లిన రోగుల్లో అధిక శాతం మందిని వైద్యులు ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఒకప్పుడు జిల్లాకు పెద్ద దిక్కుగా ఉండేది. ఈ ఆస్పత్రిని ఇప్పటికీ చాలా మంది పెద్దాస్పత్రి అనే పిలుస్తుంటారు. నిత్యం ఆస్పత్రిలో అత్యవసర వైద్య విభాగానికి నిత్యం 200 మందికి పైగా రోగులు వస్తుంటారు. అధికంగా ప్రమాదాలకు గురైనా వారినే ఇక్కడకు తీసుకొస్తుంటారు. పూతలపట్టు, బంగారుపాళెం, చిత్తూరు రూరల్, ఎస్‌ఆర్ పురం, గంగాధరనెల్లూరు, తవణంపల్లె, పలమనేరు, గుడిపాల, ఐరాల, పెనుమూరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు.

అడుగు పెట్టినప్పటి నుంచి అవస్థలే

అత్యవసర వైద్యం కోసం జిల్లాస్పత్రికి రోగి అడుగు పెట్టినప్పటి నుంచి అడుగడుగునా అవస్థలు పడాల్సివస్తోంది. ఆ విభాగంలో స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఉండవు. ఒకవేళ ఉన్నా ఆ స్ట్రెచర్ తోసుకెళ్లే వారు ఉండరు. ఆ తర్వాత వైద్యం విభాగానికి వెళితే పట్టించుకునే వారు ఉదాసీనంగా వ్యవహరిస్తూ మిన్నకుండిపోతున్నారు. దీంతో అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సరైన వైద్యం అందించకపోగా.. కండిషన్ వెరీ సీరియస్ అంటూ.. కొందరు డాక్టర్లు భయపెట్టి ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో తమిళనాడు, తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. అత్యవసర వైద్య విభాగంలో అంతా జూనియర్ డాక్టర్లతో కాలం వెళ్లదీస్తున్నారు. ఒక్కొక్క వైద్యానికి ఒక్కొక్క నిపుణుడు ఉంటారని, వారే వచ్చి చూస్తారని చెబుతున్నారు. అయితే ఆ రకంగా వైద్య సేవలు అత్యవసర విభాగంలో అందడం లేదని పలువురు వాపోతున్నారు. రాత్రి అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది.



విచారిస్తాం

“ఆ వీడియో కూడా చూశాను. సీసీ కెమెరాలో పర్యవేక్షిస్తాం. వాళ్లు ఎన్ని గంటలకు వచ్చారు. ఎవరెవరూ స్పందించలేదు స్పష్టంగా చూస్తాం. నిర్లక్ష్యంగా ఉన్నారంటే కచ్చితంగా చర్యలు ఉంటాయి. మేము కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇబ్బంది లేకుండా చూస్తాం.

– నరేష్‌కుమార్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు, చిత్తూరు

జిల్లా ప్రభుత్వాస్పత్రి వివరాలు

రోజు వారీ సాధారణ ఓపీల సంఖ్య -	1000కి పైగా
ఇన్‌పేషెంట్ -	300 నుంచి 350
అత్యవసర ఓపీలు -	200కుపైగా
సిఫార్సులు -	50 నుంచి 80వరకు
ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓల ఖాళీల సంఖ్య -	10కిపైగా

పట్టించుకుంటే ఒట్టు..

ఆస్పత్రిలో అత్యవసర వైద్య విభాగంలోని సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. అధికారులు కూడా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అత్యవసర విభాగం మొత్తం అపోలో నిర్వాహకులు చేతిలో ఉందని, ప్రభుత్వం కూడా చేతులు దులుపుకుంటోంది. సిబ్బంది కొరత ఉన్న అపోలో వారు చూసుకుంటున్నారని, భర్తీ విషయాన్ని పక్కన పెట్టేస్తోంది. ఈ కారణాలతో పేదలు అత్యవసర వైద్యం కోసం నరకం అనుభవించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అధికారులు ఫిర్యాదులను కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రికి వచ్చే పేదలకు అత్యవసర వైద్య సేవలు మెరుగు పరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అత్యవసర విభాగ ముఖద్వారం

విజయానందరెడ్డి పేరు చెబితే అరెస్టు ఉండదు!

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పోలీసుల వేధింపులు
- ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లో నిర్బంధం

చిత్తూరు అర్బన్: నగరంలోని 5వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళీరెడ్డిపై పోలీసులు వేధింపులకు దిగుతున్నారు. ఇటీవల ఇతనిపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు మూకుమ్మడిగా దాడి చేసి, ఇంట్లో విధ్వంసం చేసిన విషయం తెలిసిందే. మురళిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పరామర్శించి, దీనిపై న్యాయపరంగా పోరాటం చేయడానికి భరోసా ఇచ్చారు. అయితే మురళి తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్న వీడియోపై టీడీపీ నేతల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని విచారించాలనే నెపంతో మురళిని స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు అతడిని వేధింపులకు గురిచేశారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు సైతం మురళిని పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ప్రోద్బలంతోనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లు వాంగ్మూలం ఇవ్వాలని పోలీసులు మురళిపై ఒత్తిడి తీసుకొచ్చారు. విజయానందరెడ్డిని ఇందులో అక్రమంగా ఇరికించడానికి ఓ తప్పుడు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, అందులో సంతకం పెట్టాలని పోలీసులు వేధింపులకు దిగారు. అప్పుడే అరెస్టు చేయబోమని, 41 నోటీసు ఇస్తామని మురళిని బెదిరింపులకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తలకు వత్తాసు పలుకుతూ, దాడి చేసిన వాళ్లు కళ్లెదుటే వదిలేసిన పోలీసులపై మురళి ఇప్పటికే రాష్ట్ర హైకోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయడానికి సిద్ధమయ్యాడు. తాజాగా సోషల్ మీడియా పోస్టుకు సంబంధం లేకున్నా విజయానందరెడ్డిని బాధ్యుడిని చేయడానికి ముగ్గురు సీఐ స్థాయి అధికారులు మురళిని వేధిస్తున్నారు. తమ కార్యకర్తను ఇబ్బందులకు గురి చేసి, తప్పుడు వాంగ్మూలం ఇవ్వమని బెదిరింపులకు దిగుతున్న పోలీసు అధికారులపై కోర్టులో కేసు వేయనున్నట్లు విజయానందరెడ్డి తెలిపారు. గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో పనిచేసి, రూ.కోట్లు కొల్లగొట్టిన ఓ సీఐ, తనకు సంబంధం లేకున్నా టీడీపీ నేతల మెప్పు పొందడానికి తమ కార్యకర్తను వేధిస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. తప్పు చేస్తున్న పోలీసులను చట్టం ముందు నిలబెట్టి తీరుతామని విజయానందరెడ్డి హెచ్చరించారు.

ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు చిత్తూరు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సంబంధిత యాజమాన్యాల్లో పని చేస్తున్న ఎస్జీటీ, ల్యాంగ్వేజ్ పండిట్, పీఈటీలు సీనియారిటీ జాబితాలు ప్రచురించామన్నారు. సెకండ్ గ్రేడ్, ఈక్వలెంట్ క్యాడర్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సంబంధిత కేడర్ల టీచర్లు www.chittoordeo.com వెబ్‌సైట్‌లో ఉన్న సీనియారిటీ జాబితాలను పరిశీలించుకోవాలన్నారు. ఆ జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే ఈ నెల 5 నుంచి ఈ నెల 11వ తేదీలోపు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో వినతిపత్రం అందజేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోబోమని డీఈఓ స్పష్టం చేశారు.

నీటి కోసం నిరసన



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గౌనితిమ్మేపల్లె వాసులు

బైరెడ్డిపల్లె: తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వంతోపాటు ఆ పార్టీ నేతలు కక్షసాధింపులకు పాల్పడుతున్నారని మండలంలోని గౌనితిమ్మేపల్లె వాసులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు మొర పెట్టుకోవడంతో నూతన బోరు తవ్వకానికి నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో జనవరిలో వెయ్యి అడుగుల లోతు బోరుబావి తవ్వడంతో నీరు పుష్కలంగా వచ్చాయన్నారు. మోటారు అమర్చడంలో జాప్యం జరగడంతో 20 రోజుల క్రితం బైరెడ్డిపల్లె మండల ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటికప్పుడే మోటారు, పైపులు, స్టార్టర్‌ను కొనుగోలు చేసి ఇచ్చారన్నారు. అయితే కూటమి నేతలు బరితెగించి, పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కై ఇళ్లలో దాచిపెట్టుకున్నారని ఆరోపించారు. బోరులో పుష్కలంగా నీరున్నా, మోటారు, పైపులు అందుబాటులో ఉన్నా తాగునీటి సమస్యతో అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కక్ష సాధింపులకు పాల్పడకుండా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పూర్వకాలంలో వీధి నాటకాలు, బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్య పరిచేవారు. నేడు అదే తరహాలో కూటమి నేతల నయవంచనలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వినాయకసాగర్ పార్క్‌లో ‘విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం’ పేరుతో వీధినాటకాన్ని ప్రదర్శించారు. కాల‘కూటమి’ విషంపై ప్రజలను చైతన్యపరిచారు.

- విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ముందు ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే ప్రజలపై పెనుభారాలు
- వీధి నాటకంతో ప్రజలను చైతన్యపరచిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కూటమికి షాక్!

కూటమి హామీలు అంతా బూటకాలేనంటూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వీధి నాటకం రక్తి కట్టించింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు యచ్చం వాసుయాదవ్, పసుపులేటి సురేష్ రాయల్, హరిబాబు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు మాస్కులు ధరించి తమదైన శైలిలో నటించి ప్రజలను చైతన్యపరిచారు. దీన్ని సోషల్ మీడియా యాక్టివిస్టులు ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తున్నారు. ఆ వీధి నాటకం ఎలా సాగిందో చూద్దాం రండి..

–సాక్షి ప్రతినిధి, తిరుపతి

విద్యుత్ చార్జీల భారం కారణంగా పాపం ప్రజలు ఏమంటున్నారో విందాం రండి..

భూమన అభినయ్

రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా తిరుపతిలో ‘విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం’ అనే వీధి నాటకాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజలందరికీ చంద్రబాబు ఎలాంటివారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అబద్ధానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్. అసత్యాన్నే పలుకవలెను అంటూ అధికారంలోకి వచ్చారు. ఐదేళ్లు కరెంటు చార్జీలు పెంచనని చెప్పి ఐదు నెలలకే జనానికి షాక్ ఇచ్చారు.

భూమన అభినయ్ :
బాబు గారి హయాంలో వ్యాపారస్తుడి బాధ ఎలా ఉందో చూద్దాం రండి..

వ్యాపారి:
బాబన్న వస్తే జేబు అంతా ఖాళీ. రూ.1,500 బిల్లు వచ్చేది. ఇప్పుడు అదే బిల్లు రూ.15 వేలైంది. దేవుడికే నామం పెట్టే నారా వారి పాలన.. జనం నమ్మకానికి అవహేళన.

అభినయ్:
రైతు దేశానికి వెన్నెముక అంటారు.. మరి కూటమి ప్రభుత్వంలో రైతు ఎంత దీనంగా ఉన్నాడో చూద్దాం రండి..

రైతు:
‘పెట్టుబడి సాయం ఇస్తానని రైతులకు పంగనామాలు పెడుతున్నాడు. స్మార్ట్ మీటర్ల పేరుతో బాదబాదుతున్నాడు. ఆయనకి పవర్ వచ్చిందంటే మనకి పవర్ బిల్లు పెరిగిందని అర్థం ..’ అంటూ రైతు వేషధారి ఉరితాడు తగిలించుకుని రైతు ఆత్మహత్యల గురించి రైతు వేషధారణలోని పాపిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నం చేశారు.

సాధారణ గృహిణి:
తల్లికి వందనం అంటే వంచన అని తెలుసుకున్నాం. ప్రతి బిడ్డకీ రూ.15 వేలంటే.. అరచేతిలో స్వర్గమని అర్థమైంది. జగనన్న ఉండి ఉంటే జూన్‌లోనే డబ్బులు పడేవి. చంద్రబాబు పథకాలు ఇస్తానని చెవిలో పువ్వు పెట్టాడు. కరెంటు చార్జీలు పెంచి వైర్లలో షాక్ ఇస్తున్నాడు ఈ చంద్రన్న. అప్పులు చేసి కరెంటు బిల్లు కడుతున్నాం. చెప్తుండా వినండి చంద్రన్న ఎప్పుడొచ్చినా జనాలకి షాక్ ట్రీట్మెంట్ తప్పదు.

సూపర్ సిక్స్ అనే దొంగ హామీలతో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారు.

ఆ ముగ్గురే వచ్చి మాట్లాడితే ఇలా ఉంటుందా?

అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల పెంపుపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మధ్య జరిగే సంభాషణను వైఎస్సార్‌సీపీ నేతలు రక్తికట్టించారు.

బాబు వేషంలో వాసూయాదవ్

చూసినారు కదా అది అప్పుడు, ఇప్పుడు ఆ మాదిరి జనం నెత్తిన కరెంటు చార్జీలు మోపి మనం ముందరికి పోదాం.

పవన్ వేషంలో పసుపులేటి సురేష్ :

కానీ చార్జీలు పెంచమని చెప్పాం కదా బాబు గారు?

బాబు వేషధారి:

ఇదిగో పవన్ కళ్యాణ్ నీకు అధికారం కొత్త, ఇంకా అలవాటు పడాలి. గెలిచే వరకు జనాలపై మమకారం చూపించాలి. గెలిచాక కటిక కారం తినిపించాలి. ఇదే నా పాలసీ.

భూమన అభినయ్:

చూశారుగా చంద్రబాబు గారు అంటే ఏంటో.. ఇచ్చిన మాట మీద ఉండరు. కుర్చీ ఎక్కినాక మడత పెట్టి జనాన్ని తంతాడు.

అభినయ్:
కూటమి అంటేనే జనాలకి కాలకూట విషం. మోసం, ద్రోహం. ఇదంతా పోవాలి, మార్పు రావాలి. దీనికి మనం ఏం చేయాలంటే.. ప్రజల్లో తిరుగుబాటు తీసుకురావాలి.
జనం: పెంచిన విద్యుత్ చార్జీల బిల్లును తగలబెడదాం. 2029 నాటికి ఈ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం.



నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, నేతలు, కార్యకర్తలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠంపై వైఎస్ జగన్

2029 ఎన్నికల ఫలితాలు ఇలా ఉంటాయి..

అభినయ్:
నమ్మకం అంటే జగన్.. సంక్షేమం అంటే జగన్. 2029 ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయం.. అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్ఘాటించారు. కష్టాలు ఎక్కువ రోజులు ఉండవు.. కూటమికి రోజులు దగ్గరపడ్డాయి. వచ్చేది.. గెలిచేది మనమే.. జై జగన్...జైజై జగన్ అంటూ వీధి నాటకానికి ముగింపు పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాత్రను బిరుదాల కౌశిక్‌రెడ్డి పోషించారు. నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, సాయికుమారి, తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు, ఇరగం అనిల్‌రెడ్డి, బత్తల గీతాయాదవ్, మద్దాలి శేఖర్‌రాయల్, బత్తల అరుణ్ యాదవ్, కోటి, పునీత, సాత్విక్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన విధానంతో రిజిస్ట్రేషన్లు



పత్రాలను అందిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నూతన విధానాన్ని తీసుకొచ్చిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ గిరిబాబు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన ఆడిట్ డీఆర్ మునిశంకరయ్యతో కలిసి రిజిస్ట్రేషన్ పనితీరును పరిశీలించారు. స్లాట్ సిస్టమ్‌తో కొనుగోలుదారుడు కోరుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో క్రయవిక్రయదారులు వారికి సూచించిన వేళ్లలో కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ విధానాన్ని తొలుత జిల్లా కేంద్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారని, ఇది విజయవంతమైతే అన్ని ప్రాంతాల్లో అమలు చేయనున్నారన్నారు. అనంతరం ఈ విధానంలో తొలి రిజిస్ట్రేషన్‌ను కొంగారెడ్డిపల్లెకు చెందిన హకీంమెహ్రీన్ తన కొడుకు హకీం నూర్‌గౌస్‌ఖాన్‌కు ఆస్తిని సెటిల్‌మెంట్‌గా రిజిస్ట్రేషన్ చేయించింది. తద్వారా ప్రభుత్వానికి రూ.21 వేలు ఫీజుగా వచ్చింది. వారికి అధికారులు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మొత్తం 39 రిజిస్ట్రేషన్లు జరిగాయని సబ్‌రిజిస్ట్రార్ హేమంత్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో పార్కింగ్ షెడ్

చిత్తూరు కలెక్టరేట్ : ద్విచక్రవాహనాల పార్కింగ్ కోసం కలెక్టరేట్‌లో పార్కింగ్ షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు షెడ్ లేకపోవడంతో ఎండలోనే వాహనాలను పార్క్ చేసేవారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ చొరవతో వాహనాలను నిలుపుకునేందుకు అనువుగా రెండు షెడ్లను నిర్మించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ షెడ్ల పనులు తుది దశకు చేరుకున్నాయి.

బావిలో పడిన జింక



వ్యవసాయ బావిలో పడిన జింక

ఐరాల: దాహంతో దారి తప్పి మామిడి తోటలోకి వచ్చిన జింక శుక్రవారం వ్యవసాయ బావిలో పడింది. మండలంలోని గోవిందరెడ్డి పల్లె సమీపంలోని రైతు రంజిత్‌రెడ్డి మామిడి తోటలోకి ఓ జింక వచ్చి బావిలో పడిపోయింది. అటుగా పొలాలకు వెళుతున్న స్థానిక రైతులు గమనించి అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. డీఆర్‌ఓ రాకేష్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది బావిలోకి దిగి జింకను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కొంత సమయానికి జింక అటవీ ప్రాంతం వైపు పరుగులు పెట్టింది.

పరిశోధనలతోనే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న జోహార్ సింగ్

నారాయణవనం: వృత్తి విద్యను అభ్యసిస్తున్న యువ ఇంజినీర్లు వినూత్న పరిశోధనలతోనే గుర్తింపు పొందుతారని పలువురు పేర్కొన్నారు. స్థానిక పుత్తూరు సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియంను నిర్వహించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1,200 మంది యువ ఇంజినీర్లు 400 పరిశోధనాత్మక పత్రాలను సమర్పించారు. బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ గ్రూప్‌కు చెందిన చీఫ్ ఇంజినీర్ జోహార్ సింగ్, తిరుపతికి చెందిన ఇండో ఎంఐఎం లిమిటెడ్ హెచ్‌ఆర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిశోధనలతో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు మాట్లాడుతూ టెక్నికల్ ఇన్ఫోయిజంలను వేదికగా చేసుకుని యువ ఇంజినీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. పవర్ పాయింట్, పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి ముగ్గురు విజేతలకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లతోపాటు నగదు బహుమతిని అందజేశారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్‌సీపీ

పుంగనూరు: వైఎస్సార్ సీపీ ఆది నుంచి ముస్లింలకు అండగా నిలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తొలి నుంచి ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, ముస్లింలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటున్నారు. కేంద్రం ముస్లింలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన ప్రతి బిల్లును వైఎస్సార్‌సీపీ అడ్డుకుని, ముస్లింలకు అండగా నిలుస్తోంది. ముస్లింల మనోభావాలను గౌరవిస్తోంది. వారి హక్కులను కాపాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డికి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం పోరాడుతున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు నిరసనగా జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ముస్లింలు నిరసనలు వ్యక్తం చేస్తూ, ఆందోళన చేపడుతున్నారు.

మసీదులు, దర్గాలు కూల్చేందుకే వక్ఫ్ బిల్లు

మసీదులు, దర్గాలు కూల్చడంతోపాటు ముస్లింల ఉనికి లేకుండా చేసేందుకే కేంద్రం వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరణ చేస్తుందని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం, మైనార్టీ సెల్ సీమ జిల్లాల అధ్యక్షుడు ఫక్రుద్దిన్‌షరీఫ్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర మాజీ చైర్మన్ అమ్ము, మక్కా కమిటీ



మాట్లాడుతున్న ముస్లిం నేతలు ఎంఎస్.సలీం, అలీమ్‌బాషా, ఫక్రుద్దిన్‌షరీఫ్, ఖాదర్

రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఖాదర్, ముస్లిం పెద్దలు అజీజ్ సాహెబ్, ఎస్‌ఆర్.రహంతుల్లా పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సలీం మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లు ఆమోదానికి కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ముస్లింలకు చెందిన మసీదులు, దర్గాలు, షాదీమహళ్లతోపాటు ముస్లింల ఉనికి లేకుండా చేసేందుకు దోహదం చేస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం భూస్థాపితం కాకతప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మైనారిటీల హక్కులను హరించే బిల్లు

పలమనేరు: దేశంలోని మైనారిటీల హక్కులను హరించేందుకు కేంద్రంలోని బీజేపీ పక్కా వ్యూహంతో చేపట్టిన బిల్లుకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం బాధాకరమని స్థానిక ముస్లిం నాయకులు, కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు మసీదుల వద్ద వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుతో జరిగే అనర్థాలను తెలిపే కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. మసీదుల వద్ద నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్ల కోసం నాటకాలాడి ఆపై వారి స్వార్థం కోసం తమను కరివేపాకులా వాడుకుని పడేస్తారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం కేంద్ర పాటించకుండా బిల్లును ఆమోదింపజేశారన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ మాత్రం దీన్ని వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు రహీంఖాన్, సీపీఎం కార్యదర్శి గిరిధర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

అన్యమతస్తులా..

మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను కాపాడుకుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు. అన్యమతస్తులను వక్ఫ్ బోర్డులోనికి ఎలా అనుమతిస్తారంటూ నిలదీశారు. రాజ్యాంగంలో ఎవరి మతాలు వారికి గొప్పవని, ఒకరి మతంలో ఒకరిని చేర్చడం ముస్లింలను నిర్మూలించేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఫక్రుద్దిన్‌షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మతతత్వ పార్టీతో పొత్తు పెట్టుకున్న రోజే ముస్లింలకు ఇబ్బందులు వస్తాయని ఊహించామన్నారు. అధికారం కోసం ముస్లింలను దగ్గరపెట్టుకుని, అధికారం రాగానే ముస్లింలను భూస్థాపితం చేసేందుకు కుట్రలు జరుగుతోందని ఆవేదన వ్యక్తం చే శారు. ముస్లిం నాయకులు కిజర్‌ఖాన్, మహబూబ్‌బాషా, మౌల, జావీద్, అమ్మన్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది కలిగిస్తే సహించం



సమాజంలో ఐకమత్యంతో క్రమశిక్షణ కలిగిన ముస్లింల హక్కులకు ఎవరు భంగం కలిగించిన సహించేది లేదు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన మేరకు బిల్లును వ్యతిరేకించాం. వక్ఫ్ బోర్డులో ఇతరులను సభ్యులుగా చేర్చడం, జిల్లా కలెక్టర్లకు అధికారాలు కల్పించడం ముస్లింలు, వారి ఆస్తులకు భంగం కలిగినట్లే. ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వైఎస్సార్‌సీపీ అండగా ఉండి, పోరాటం చేస్తుంది.

– పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

కూటమి నైజం బయటపడింది



వక్ఫ్ సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతివ్వడంతో మైనారిటీలపై వారికున్న కపట ప్రేమ బయటపడింది. ఇప్పటికైనా కూటమిలోని ముస్లింలు దీనిపై ప్రశ్నించాలి. దేశంలో లౌకికవాదం లేకుండా పోతోందనే భావన మేధావులను సైతం ఆలోచింపజేస్తోంది. దీనిపై ఆ పార్టీలు ఏమని సమాధానం చెబుతాయి.

– ముజ్జు, మైనారిటీ యువనేత, పలమనేరు

దుర్వినియోగం కావడం ఖాయం



ఎన్నో ఏళ్లుగా ఉన్న వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ద్వారా కొత్త విధానాలను తీసుకురావడంతో వక్ఫ్‌లో ఇతరుల ప్రమేయం ఏర్పడుతుంది. ఫలితంగా మసీదులు, తది తరాల ఆస్తులపై కొత్తవారి ప్రమేయం రాక తప్పదు. ఈ సవరణతో మైనారిటీలకు అన్యాయం జరుగుతుందని తెలిసినా ఇంకా చాలామంది నిద్ర లేవలేదు. ఈ బిల్లును కాంగ్రెస్, వైఎస్సార్ సీపీలు వ్యతిరేకించగా కూటమి ఎంపీలు అనుకూలంగా మారారు.

– రహీంఖాన్, పలమనేరు

ముస్లింలకు అన్యాయమే



వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదంతో ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుంది. ఎందుకంటే ఇందులోకి ఇతర మతస్తులు రానున్నారు. రాష్ట్రంలోని మైనారిటీలకు మేలు చేసిందెవరో, కీడు చేసిందెవరో ఇప్పుడు పూర్తిగా అర్థమైంది. ముఖ్యంగా వేలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులపై బడాబాబుల పెత్తనం వస్తుంది. చాలావరకు భూములు అన్యాక్రాంతమైయ్యే అవకాశం ఉంది.

– ముబారక్, పలమనేరు

బాబా సేవలో పెద్దిరెడ్డి దంపతులు



సాయిబాబాకు పూజలు చేస్తున్న పెద్దిరెడ్డి దంపతులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో శుక్రవారం జరిగిన షిరిడీ సాయిబాబా మందిరం కుంభాభిషేక కార్యక్రమంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి ఆయన భార్య స్వర్ణలత పాల్గొన్నారు. కుంభాభిషేక కార్యక్రమానికి విచ్చేసిన పెద్దిరెడ్డికి వ్యవసాయ సలహామండలి జిల్లా మాజీ చైర్మన్ పాలకూరు రామచంద్రారెడ్డి, ఆలయక కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వారికి ఆశీర్వనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే బాబాను మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, చింతల రామచంద్రారెడ్డి, లలితకుమారి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఆర్టీసీ మాజీ ఉపాధ్యక్షులు విజయానందరెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డ్వామా పరిధిలో అమలవుతున్న ఉపాధి హామీ పథకంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో రూ.150 కోట్లతో మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

50 శాతం కరువు ప్రాంతాలు

2024–25 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 50 శాతం ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 50 శాతం మండలాల్లో భూగర్భ జలవనరులు తగ్గడాన్ని గుర్తించామన్నారు. ఉపాధి హామీ పథకంలో ఫారమ్‌పాండ్‌ల నిర్మాణం చేపట్టి భూగర్భ నీటి మట్టాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో 2025–26 సంవత్సరానికి జిల్లాలో 13 వేల ఫారమ్‌పాండ్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో ఫారమ్ పాండ్‌లో లక్ష లీటర్ల నీటిని నిల్వ చేయడంతోపాటు భూగర్భజల మట్టాన్ని పెంచవచ్చని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ ప్రాంతాలకు ప్రాధాన్యం

జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చిత్తూరు–వేలూరు, యాదమరి–చిత్తూరు రోడ్డు, పలమనేరు నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, 25 స్కూల్ కాంపౌండ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నీటి ట్యాంకర్ల అవసరం లేకుండా వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

• దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో డిప్యూటేషన్‌పై అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులుగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులుగా ఎఫ్‌ఎస్‌టీసీ కండీషన్‌పై పనిచేయుడానికి ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించిన తరువాత విధిగా మాన్యువల్ అప్లికేషన్, అలాగే సంబంధిత మార్కుల జాబితాను హెచ్‌ఎం, డీవైఈఓ, డీఈఓలతో ధ్రువీకరించి, ఈ నెల 10వ తేదీ లోపు కళాశాలలో సమర్పించాలన్నారు. డైట్‌లో టీచర్ ఎడ్యుకేషన్, తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్, సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ పాఠ్యాంశాల్లో ఖాళీలున్నాయని ఆయన పేర్కొన్నారు.

• అడ్మిషన్లకు 13న ప్రవేశ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం అడ్మిషన్‌లకు ఈ నెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్ గీత వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సంబంధిత గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్‌లను దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఈ నెల 13వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ గీత తెలిపారు.

• నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 5వ తేదీన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని గంగినేని చెరువు కట్ట వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ భవనం వరకు చిత్రపటంతో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ భవనంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంఘ నాయకులు, కార్మికులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు హాజరై, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆ అపరిచితుడు ఎవరు?

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సంబంధించి ఓ అపరిచితుడు తళుక్కుమంటున్నాడు. ఇంతకీ ఆ అపరిచితుడు ఎవరు.. అన్న విషయం బయటకు రావాల్సి ఉంది. కొన్ని రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరువు బజారున పడుతోందని ఓ అధికారి తల పట్టుకుంటున్నారు. కార్యాలయంలో తుమ్మినా.. దగ్గినా వెంటనే ఆ విషయం బయటకు వచ్చేస్తోందని వాపోతున్నారు. వసూళ్లు, పలు రకాల ఫైళ్ల తతంగాలు, బిల్లుల గోల్‌మాల్‌లు అలా చేస్తే.. ఇలా బయటకు వచ్చేస్తున్నాయని మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక వసూళ్ల విషయానికి వస్తే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నలుగురే నాలుగు స్తంభాలుగా ఉన్నారన్న విషయం మారుమోగుతోంది. ఆ నలుగురితోనే వసూళ్ల దందా నడుస్తోందని, తలుపు లేసుకుని వసూళ్ల పంచాయితీలు చేస్తున్నారనే ప్రచారం సాగింది. దీంతో వెంటనే బాస్(మేడం లేదా సార్)తో ఈ విషయంపై చర్చించారు. రూట్ మార్చారు. నమ్మిన బంటును రంగంలోకి దింపారు.

ఈ అపరిచితుడు ఏమి చేస్తాండంటే..

డాక్టర్లు, అధికారులు, ప్రైవేటు ఆస్పత్రులు, తదితర కార్యకలపాలకు సంబంధించిన వివరాలను అపరిచితుడు చేతిలో పెడతారు. సాయంత్రానికి ఆ అపరిచితుడు డాక్టర్లు, అధికారులు, ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులకు ఫోన్ చేసి పలానా ఫైలు ఉంది.. ముడుపులు ఎంత ఇవ్వాలనే విషయాన్ని వివరిస్తాడు. ఆ అపరిచితుడు చెప్పిన చోటికి నగదు పంపిస్తే..ఫైళ్లు కదులుతాయి. లేకుంటే లేదు. ఈ తరుణంలో ఇదేమి కర్మరా బాబూ అంటూ జిల్లాలోని కొందరు డాక్టర్లు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పని జరగాలంటే ఆ అపరిచితుడు అడిగినంత చచ్చినట్టు ఇచ్చుకున్నామని అంటున్నారు. ఆ వివరాలు బయటపెడితే రేపు కార్యాలయంలో మేము పని చేయాలి కదా? అనే భయం ప్రతి ఒక్కరిని వెంటాడుతోంది. ఇలాగే కొనసాగితే..ఆ ఫోన్ నంబర్‌తోపాటు వ్యక్తి ఆచూకీని బహిర్గతం చేస్తామని.. అంతవరకు ఈ విషయం వద్దు స్వామీ అంటూ దాటవేస్తున్నారు. ఇదంతా ఎవరు చేయిస్తున్నారు..ఎలా చేయిస్తున్నారనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే.

మాజీ డిప్యూటీ సీఎం సుడిగాలి పర్యటన



కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శ్రీరంగరాజపురం మండలంలోని సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకులను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. తొలుత పెద్దతయ్యూరులోని వెంకటేష్, సాయికుమార్, 49 కొత్తపల్లిమిట్టలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోవిందస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు దొరస్వామి, సుందరమూర్తిరెడ్డిని పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు నాచరమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులు రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచకాలు, అక్రమ అరెస్టులకు ఎవరూ అధైర్య పడవద్దని, రాబోయే ఎన్నికల్లో జగనన్న సీఎం అవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్త, నాయకులు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీపీ సరిత, క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, పార్టీ పంచాయతీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సంస్కృతిక విభాగం మండల అధ్యక్షులు మణి, వలంటరీ విభాగం మండల అధ్యక్షుడు అశోక్, కోఆప్షన్ సభ్యుడు ఏసయ్య, నాయుకులు శ్యామ్‌బాబు, భూపతిరెడ్డి, కోటిరెడ్డి, సుధా, కుమార్, సుబ్బనాయుడు, శేషు, ముత్తు ఉన్నారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా?

యాదమరి: అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరిని యాదమరి మండల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. మండలంలో జరుగుతున్న వరుస చోరీలకు సంబంధించి శుక్రవారం ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పలు కేసులకు సంబంధించి వారిని విచారించగా ఆ చోరీలకు తామే పాల్పడ్డామని అంగీకరించినట్లు సమాచారం. కాగా గత మార్చిలో యాదమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు టీవీలు చోరీ విషయం విదితమే. ఆ కేసు దర్యాప్తులో భాగంగానే ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరు కీలక నిందితులు అరెస్టయ్యారు. శనివారం నిందితుల అరెస్టుని చూపే అవకాశం ఉంది.

గాయపడిన కార్మికుడికి మెరుగైన చికిత్స

తవణంపల్లె: వల్లభ డెయిరీలో ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికుడు యతిరాజుకు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మెరుగైన చికిత్సను అందిస్తున్నట్లు ఆ డెయిరీ ప్లాంట్ మేనేజర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అతనికి కాలిన గాయాలు పూర్తిగా నయం కావడానికి కొంత సమయం పడుతుందన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కార్మికుడి గాయాలు పూర్తిగా నయమయ్యే వరకు తాము దగ్గరుండి వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చామన్నారు. దీనిపై వస్తున్న వదంతులు, అపోహలు నమ్మవద్దని అతనికి అన్ని విధాలుగా సాయం అందిస్తామని పేర్కొన్నారు.

7 నుంచి సీబీఏ, ఎస్ఏ–2 పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు సీబీఏ–3, సమ్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలు ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తొమ్మిదో తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిదో తరగతి సీబీఏ–3 పరీక్ష, పదో తరగతి పరీక్ష విధానానికి అనుగుణంగా ఉంటుందన్నారు. అన్ని తరగతులకు సంబంధించి సెమిస్టర్ 1, సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాల్లోని పూర్తి సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రశ్నపత్రాలు ఎమ్మార్సీల్లో భద్రపరుస్తామన్నారు. ప్రశ్నపత్రాల భద్రతకు ముగ్గురు సభ్యులతో కమిటీ నియమించామన్నారు. ఎంఈఓ–1, 2, హెచ్‌ఎం ఒకరు కమిటీల్లో సభ్యులుగా ఉంటారన్నారు.

మూల్యాంకనం, ప్రోగ్రెస్ కార్డులు, ప్రమోషన్ ఇలా..

ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే పరీక్షల జవాబు పత్రాలకు ప్రతి టీచర్ ఈ నెల 19 వ తేదీ లోపు మూల్యాంకనం పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఈ నెల 21వ తేదీన విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. 23వ తేదీన విద్యార్థుల నుంచి తిరిగి ప్రోగ్రెస్ కార్డులను తప్పకుండా సేకరించాలన్నారు. విద్యార్థుల ప్రమోషన్ జాబితాను ఈ నెల 23వ తేదీన సమర్పించాలని ఆదేశించారు.

పరీక్షల షెడ్యూల్

తేదీ	పరీక్ష
ఏప్రిల్ 7	మొదటి ల్యాంగ్వేజ్
8	సెకండ్ ల్యాంగ్వేజ్
9	మొదటి ల్యాంగ్వేజ్ మూడవ ల్యాంగ్వేజ్
10	ఇంగ్లిష్ గణితం
11	గణితం జనరల్ సైన్స్/ఫిజికల్ సైన్స్
12	ఈవీఎస్ (3,4,5 తరగతులకు) బయాలజికల్ సైన్స్
15	ఓఎస్ఎస్‌సీ (3,4,5 తరగతులకు) సోషల్ స్టడీస్
16	కాంపోజిట్ కోర్స్, ఓఎస్ఎస్‌సీ పేపర్–1
17	కాంపోజిట్ కోర్స్, ఓఎస్ఎస్‌సీ పేపర్–2

తండ్రి హత్య కేసులో తనయుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీరంగరాజపురం : తండ్రిని హత్య చేసిన కుమారుడు నాగరాజుని పోలీసులు శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. శ్రీరంగరాజపురం మండలం డీఆర్‌ఆర్ పురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు మందడిని అతడి కొడుకు నాగరాజు బుధవారం రాత్రి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం డీఆర్‌ఆర్ పురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉండగా నాగరాజును అరెస్టు చేసినట్టు తెలిపారు. ఎస్ఐ సుమన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.